**కథ**

# టిట్ ఫర్ టాట్

శ్రీవారు, పిల్లలూ ఆఫీసుకీ స్కూళ్ళకూ వెళ్ళాక ఇంట్లో పనంతా చేసుకుని వడియాల పిండితో బయటకొచ్చింది స్పర్శ. మంచం మీద ప్లాస్టిక్ కాగితం పరిచి కుచ్చెళ్ళు పైకి ఎగదోపి ''చందన చర్చిత నీల కళేబర పీతవసన వనమాలీ'' అంటూ తనలో తను జయదేవుని అష్టపదులు కూనిరాగం తీస్తూ గబగబా వడియాలు పెట్టసాగింది.

ఆడవాళ్ళు వడియాలు పెట్టడం చూశాకనే అసలు విశ్వంలో చుక్కలు పెట్టబడ్డాయేమో! లేకపోతే అచ్చం నీలిరంగు ఒరుగు కాగితం మీద పెట్టిన మినప వడియాల్లా ఎందుకు మెరుస్తాయసలు! ఎంతయినా ఆదిశక్తులు కదండీ! అలసటే వుండదు. పైగా ఏ పని చేసినా ఎంతందంగా వుంటారో అంతందంగా చేస్తారు!

కుచ్చెళ్ళు పైకి పెట్టి తల స్నానపు శిరోజాలకు తువ్వాలు చుట్టి పసుపు రాసిన పాదాలకు గజ్జెలు మెలేసుకోగా నుదుటి మీద పడే ముంగురులను ఎడం చేత్తో వెనక్కి సర్దుకుంటూ, కుడిచేత్తో వడియాలు పెడుతూ కూనిరాగం తీస్తూ వుంటే....

నిజంగా మనసుండాలిగానీ, ఏ ఆర్టిస్ట్ చూసినా అమాంతం స్కెచ్ గీసేయాలనిపించదూ! కవి చూస్తే కవిత రాయాలనిపించదూ! ఏదేమైనా వడియాలు పెట్టినా, ముగ్గులేసినా, కరాటే చేస్తూ ముక్కు చితక్కొట్టినా ఆడవాళ్ళు స్పెషల్‌గానే వుంటారండీ! ఒప్పుకోని వాళ్ళకు స్పందన లేనట్టే! వాళ్ళనేం అనలేం కూడా జాలి పడటం తప్ప!

అది పంచవటి లాంటిది! అన్నీ అద్దెల పోర్షన్లు! మగాళ్ళూ పిల్లలు వెళ్ళాక ఆడాళ్ళు కూర్చుని ఎంచక్కా ప్రపంచ వార్తలన్నీ చర్చించే వేదిక అది! ఆడాళ్ళ కబుర్లలోకి రాని టాపిక్ వుండదక్కడ! 'మగువకు తెలియని విషయం కలదె ప్రపంచమున' అని గొప్ప బహిరంగ సభలు జరుపుతారక్కడ!

''స్పర్శా! వడియాలు పెడుతున్నావా?'' చూస్తూనే అడిగింది పక్కింటి పిన్నిగారు.

''అవునండీ! భోజనంలో నంచుకు ఏదైనా లేకపోతే పిల్లలూ ఆయన సణుగుతూ గొణుగుతూ భోంచేస్తారండీ! అయినా ఎలాగూ వానలు పడటం లేదు. ఒక్కో పని పూర్తవుతుందని, ఇంకా జ్యూస్ చెయ్యాలి, ఊర మిరపకాయలు కలపాలి''

ఒక్క ప్రశ్నకు వంద సమాధానాలు! ఆడవాళ్ళని పలకరించి గెలిచేదెవరండీ?

''మంచి పనేలే! అన్నింట్లో ముందుంటావు నువ్వు! ఎంతయినా తెలివైన దానివి!'' వడియాల పిండి తీసుకుని తనూ పెట్టసాగింది.

''అయ్యో మీకెందుకండీ శ్రమ పెద్దవారు. అలా కూర్చోండి కబుర్లు చెబుతూ! నిముషాల్లో పెట్టేస్తా!'' అంది స్పర్శ.

అవును మరి కబుర్లలో పడితే తాజ్‌మహల్‌నయినా నిముషాల్లో కట్టేయగలరు ఆడవాళ్ళు!

''ఇందులో ఏముందమ్మాయ్! ఈరోజు నీకు సాయం చేస్తే రేపు నువ్వు నాకు సాయం చేస్తావు! ఒకచోట వుండేవాళ్ళం ఆమాత్రం చేదోడు వాదోడుగా లేకపోతే ఎలా?'' అన్నాక ఇక అడ్డు చెప్పలేదు స్పర్శ.

చేదోడు మొదలైంది. ఇక వాదోడే మొదలుపెట్టాలి. ఎలా మొదలెట్టాలో ముప్పైయ్యేళ్ళ సంసార జీవనం ఆవిడకు అన్నీ నేర్పించేసింది. అందుకే చేదోడు అంటూ దగ్గరకు వచ్చి, వాదోడుకు దిగబోతోంది.

''ఏమిటీ స్పర్శా! మీవారు రాత్రి పదకొండు ఆ ప్రాంతంలో అప్పుడప్పుడు బయటకెళ్తుంటారు! ఏదైనా పని మీదా ఏమిటి?''

''అవును పిన్నిగారూ!''

''అవున్లేమ్మా! మగాళ్ళకు బోల్డు పనులుంటాయి. అయినా నాకు తెలీక అడుగుతానే అమ్మాయ్! పదకొండు దాటాక పనులున్నా షాపులూ ఆఫీసులూ మూసేస్తారుగా!'' 'నరం' చూసి నొక్కింది.

''పనులంటే ఆఫీసు పనులు కాదు పిన్నిగారు! తన స్నేహితులను కలవడానికి కాసేపు సరదాగా కబుర్లు చెప్పుకోడానికి వెళతారు''

''చిత్రంగానీ, అర్ధరాత్రి స్నేహితుల్ని కలవడమూ కబుర్లు చెప్పుకోవడమేమిటే, అమ్మాయీ! లక్షణంగా ఏ సాయంత్రమో, ఆదివారమో కలవొచ్చుగా! వాళ్ళ పెళ్ళాలయినా ఎలా ఒప్పుకుంటారే అర్ధరాత్రి వచ్చి కబుర్లు చెప్పే ఫ్రెండ్‌ని! నాకు తెలీకడుగా! మా కాలంలో ఇవి లేవు తల్లీ! అందుకే తెలుసుకోవాలనీ...'' మెదడులో పజిల్ గీసి ఏమీ ఎరగనట్టు నసిగింది. స్పర్శకూ ఆన్సర్ దొరకలేదా ప్రశ్నకు!

''మరేం లేదు పిన్నీ! ఫ్రెండ్సంతా అప్పుడప్పుడు రోజుకో ఇంట్లో కలుసుకుని విసిఆర్‌లో సినిమాలు గట్రా చూస్తుంటారు సరదాగా''

''ఎందుకే స్పర్శా ఫ్రెండ్స్‌తో కలిసి చూడటం! ఎంచక్కా పెళ్ళాం పిల్లలతో కలిసి చూడొచ్చుగా! మీ సరదా కూడా తీరుతుంది'' కొంచెం స్పర్శ మీద జాలి చూపించింది.

''పెళ్ళాం పిల్లలూ ఎప్పుడూ వుంటారుగా పిన్నిగారూ! చిన్ననాటి స్నేహితులు కలసి ఎంజాయ్ చెయ్యడం వేరుగా వుండదూ''

''అవున్లే! నేనేం కాలేజీకెళ్ళానా? నాకేమైనా ఫ్రెండ్స్ వున్నారా? నీలాంటి వాళ్ళు చెప్తే తెలుసుకోవాల్సిందే! అది సరే, మరి మీ ఇంట్లో ఎప్పుడూ కలుసుకోలేదేమిటే, అమ్మాయీ?'' అనడిగిందావిడ.

'అవునూ ఈ అనుమానం తనకి రాలేదెందుకు! అప్పుడు ఆలోచనలో పడింది స్పర్శ! సమాధానం చెప్పని స్పర్శను చూసి చేదోడు అయిపోయినట్టు

''వెళ్ళొస్తానే స్పర్శా! పొయ్యి మీద పాలు సన్నసెగలో పెట్టాను మరిగి వుంటాయేమో! నేనిలా అడిగానని ఏమీ అనుకోకు! ఏదో పెద్దదాన్ని తెలీకడిగానమ్మా'' అంటూ వెళ్ళిపోయిందావిడ స్పర్శ మెదడులో సుడిగుండం రేపి!

★★★

''ఏవండీ! మీరప్పుడప్పుడూ స్నేహితులను కలవడానికని రాత్రి పూట వెళుతుంటారు కదా!''

''అవునూ! నిన్నూ పిల్లల్నీ డిస్ట్రబ్ చేయకుండా నా దగ్గరున్న కీస్‌తో లాక్ తీసుకుని వెళ్ళి మళ్ళీ వచ్చి లాక్ వేసి పడుకుంటాను. రాత్రేమైనా మిమ్మల్ని డిస్ట్రబ్ చేశానా?'' అడిగాడు, ఎప్పుడూ రాని టాపిక్ ఇప్పుడెందుకొచ్చింది చెప్మా అనుకుని.

స్పర్శ అచ్చమైన ఇల్లాలు. భర్త ఏది చెబితే అది నిజమని నమ్మే ఇల్లాలు! అందుకే వెంకట్రావ్‌కు అంత నమ్మకం!

''మమ్మల్ని డిస్ట్రబ్ చేశారని కాదండీ! ప్రతీసారీ మీరే వాళ్ళిళ్ళకు వెళ్ళడం, వాళ్ళ భార్యలు మీకు అవీ ఇవీ చేసిపెట్టడం ఏం బావుంటుందండీ! ఓసారి మనింట్లో కూడా పెడితే బావుంటుంది కదా'' అంది. పొలమారింది వెంకట్రావ్‌కు. తేరుకుని...


''నీ తలకాయ! వాళ్ళు మనింటికి రారు'' అన్నాడు.

''ఏం... మనిల్లు వాళ్ళ ఇళ్ళల్లా బావుండదా?''

''బావుండడం కాదు రారంతే! నేనలా అలవాటు చెయ్యాలా! వెధవ సంత అవుతుంది, నీకు

శ్రమ కూడా'' సమ్మోహ నాస్త్రం వేశాడు.

''మరి వాళ్ళ పెళ్ళాలూ మీరన్నట్టు గానే అనుకోరూ! ఏదేమైనా ఈసారి మనింట్లో పెట్టండి! లేకపోతే మీరు వెళ్ళడం మానండి'' అంది



మొండిగా పెరుగు వేస్తూ.

''పెరుగింత పుల్లగా చచ్చిందేం? పెద్దవాడు నిద్రపోయాడప్పుడే, హోం వర్క్ అప్పుడే అయిపోయిందా? చిన్నాడ్ని క్రికెట్‌కెళ్తే కాళ్ళు విరగ్గొడతానన్నాను ఈరోజు వెళ్ళాడా?'' అంటూ అర్థం పర్థం లేకుండా కసిరి చెయ్యి కడిగేసి సీరియస్‌గా టీవీ ఆన్ చేసి వార్తల్లో పడిపోయాడు వెంకట్రావ్.

★★★

ఎస్కేపింగ్...

అసలు విషయంలోకి వస్తే దొరికిపోతామని ఎస్కేపింగ్!

అప్పటిదాకా సరదాగా వుండి, అంతలోనే సీరియస్ అయిపోయి టాపిక్ ఆపేసే చీప్ ట్రిక్!

'మాకు తెలీదా మీ గంభీరం వెనక గాథ నిజాలు!' వంటిల్లు సర్దుతూ ఆలోచనలో పడింది స్పర్శ.

ఎందుకలా కోపం వచ్చింది ఆయనకి. తను అన్న మాటల్లో తప్పేం లేదే? కోపంతో టాపిక్ మార్చడానికి కారణం ఏంటబ్బా... అని!

వంటింట్లో గిన్నెల చప్పుడు వింటూ 'హమ్మయ్య గండం గడిచింది' అనుకున్నాడు వెంకట్రావ్.

★★★

మరుసటి రోజసలు బయటకు రాని స్పర్శను పలకరించడానికొచ్చింది పిన్నిగారు.

''ఏవిటే స్పర్శా! ఈరోజసలు బయటకే రాలేదు. నిన్న ఎండలో కూర్చుని వడియాలు పెట్టావు! ఒంట్లో బాలేదా ఏమిటే?'' అంది.

''మరే! తలనొప్పిగా వుంది పిన్నిగారు. అలాగే ఇంటి పనీ వంట పనీ, బట్టల పనీ అయ్యేసరికి నీరసం వచ్చి పడుకున్నా'' అంది వడలిన మొహంతో.

''అదేమిటే స్పర్శా! నన్ను పిలవకూడదూ! కాసింత కాఫీ పెట్టిచ్చే దాన్ని. నీకు నేను నాకు నువ్వు సాయం అంతే! ఇలారా తలకు బిగుతుగా తువ్వాలు కడతాను'' అంది. ఆ ఆప్యాయతకు స్పర్శ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''అదేవిటే స్పర్శా! తలనొప్పికే ఏడుస్తారా?''

''అది కాదు పిన్నిగారు! మా అమ్మ గుర్తుకొచ్చింది''

''సరేలే, నేను మాత్రం మీ అమ్మను కాదా? కంటేనే అమ్మవుతుందా?'' ఓదార్చిందావిడ.

''మరేం లేదు పిన్నిగారూ! రాత్రి ఆయన విసుక్కున్నారు. పైగా మాట్లాడటం లేదు. ఉదయం చిన్నోడ్ని కొట్టారు కూడా! కారణం లేకుండా ఆయనెందుకు చిరాకు పడుతున్నారో అర్థం కావడం లేదు'' అంది కళ్ళు తుడుచుకుంటూ.

''ఏమీ అనుకోకు, తల్లిలాంటి దాన్ని! అసలు మీ ఆయనకు కోపం ఎందుకొచ్చిందమ్మాయ్?''

''అదే... మనింట్లో ఒకసారి ఫ్రెండ్స్ మీటింగ్ పెట్టండి అన్నాను'' అంది.

'హమ్మయ్య పాకానికొచ్చింది విషయం' మనసులో అనుకుని..''ఇందులో తప్పేం వుంది? అడిగే వాళ్ళు లేరని అలుసుగానీ '' అంటూ దీర్ఘం తీసిందావిడ.

''పెట్టకపోతే పెట్టకపోయారు. నన్నంటే ఏమన్నా పర్లేదు! పిల్లల్ని విసుక్కోవడం, కొట్టడం భరించలేను పిన్నిగారు!'' మళ్ళీ స్పర్శ గొంతులో జీర.

శ్రీలత

''ఎందుకేడవడం! నేనో మాట చెబు...ను కడుపులో దాచుకుంటావా?'' అడిగింది మెల్ల...

''మీరు చెప్పినవి నేనెవరికైనా చెప్పినా ...న్ని గారూ?'' అంది రహస్యం వినడానికి సి...ప్లై పోతూ. అంతకు ముందున్న టెన్షన్ ఎ...పో యిందో తెలీదు. ఎక్కడ లేని హుషారొచ్చి...ది. రహస్యాలకు వుండే పవరే అంతా!

''అది కాదే అమ్మాయీ! మీ ఆయన్ని మొ...న్న మధ్య అదేదో హోటల్లో వేరే అమ్మాయి...తో చూశారట మీ బాబాయ్‌గారు! నాకు చెప్పి ...ం పైనే అయినా నువ్వు బాధపడతావని నేను ...ప్ప లేదు. కామాక్షికి, నీలవేణికి కూడా తెలుసు ఈ విషయం! నేను చెప్పలేదు సుమా. వాళ్ళ మొగు...ళ్ళు చెప్పారట! సంసారం అల్లరి కాకముందే సర్దుబా...టు చేసుకో. మీ ఆయన ఏ ఫ్రెండింటికీ వెళ్ళ...టం లేదు. లాడ్జీలకు వెళుతున్నాడు. ఇదో ఫ్యా...షన య్యింది మొగాళ్ళకు! పండగ నాడూ పాత పె...ళ్ళా మేనా అని వెరైటీ కోసం అలా వెళ్తారట! నా...కు తెలుసు కామాక్షి చెప్పింది. దాని మొగుడూ ...లా తిరుగుతుంటే భలే బుద్ధి చెప్పిందిలే! ఇప్పు...డు రాత్రయ్యాక గడప దాటితే ఒట్టు! నేనబ...ం చెప్పడం లేదమ్మాయ్! నేనూ ఆడదాన్నే, ఆడ...ది కాపురం కూలగొడతానా? తల్లిలాంటి దాన్ని! ...ర విరక్కుండా పాము చావకుండా సర్దుబాటు చే...సు కోవాలి సంసారం! అక్కడే ఆడదాని తెలివి ప...నా చేది. జాగ్రత్త తల్లీ'' అంటూ ఊపిరి పీల్చుకు...ంది ఆవిడ.

''కామాక్షి ఏం చేసిందేవిటీ?'' కుతూ...హ లంగా అడిగింది.

చెప్పాల్సిందంతా చెప్పి ఇక తన పాత్రను ము...గిం చుకుని వెళ్ళిపోయిందావిడ.

అప్పుడు గుర్తొచ్చింది స్పర్శకు. ఎప్పుడ...ూ జీవితం వెరైటీగా వుండాలి. ఒకేలా వుంటే బో...ర్ ఈ మంచాలిలా జరుపు, కొన్నాళ్ళు మారు...స్తూ వుంటుంది. ఆ టీవీ ఈ మూల పెట్టు ఛేంజ్...గా వుంటుంది.. ఈరోజు హోటల్‌కెళుతున్నా...ం ఎదురు చూడకండి. మీరు భోం చేయండి. నా...కు ఇంటి భోజనం తినీ తినీ వెగటు పుట్టింది. జీవితానికి వెరైటీ అంటూ లేకపోతే థ్రిల్ వుండదు అని మాట్లాడే భర్తను చూసి మురిసి పోయే తన మూర్ఖత్వం గుర్తుకొచ్చి ఏడుపొచ్చేసింది. ఇప్పుడు తను బోర్ కొట్టిందన్నమాట. వెరైటీ కావాల్సొచ్చిందన్నమాట. రానీ చెప్తా... అనుకుని కళ్ళు తుడుచుకుని పిల్లలకు అన్నం తినిపించి పడుకోబెట్టింది.

అమ్మలో వుండే గొప్ప లక్షణం ఇదే! తన మనసులో లేదా సంసారంలో 'కురుక్షేత్రం' జరుగుతున్నా పిల్లలకు మాత్రం తెలీనివ్వదు. వాళ్ళు భయపడతారనో, నొచ్చుకుంటారనో దిగమింగుకుని వాళ్ళతో నవ్వుతూ ఆడుతూనే వుంటుంది లోపల రగులుతున్నా!

శ్రీవారు వచ్చాక చక్కగా కబుర్లు చెబుతూ భోజనం వడ్డించింది. వంటిల్లు సర్దింది మౌనంగా. బెడ్‌రూమ్ దుప్పట్లు సరిచేసింది. లైట్లన్నీ ఆర్పి బెడ్ లైట్ వేసింది. హాయిగా బెడ్ మీద పడుకుని భోగేంద్రుడిలా వున్న భర్త దగ్గరకు వెళ్ళి ''ఏవండీ! నేనలా బయటికెళ్ళొస్తా! నా దగ్గర తాళాలున్నాయిగా ఇంకో సెట్! మీరు నిద్రపోండి. మిమ్మల్ని డిస్టర్బ్ చేయకుండా వచ్చి పడుకుంటా. అసలే ఆఫీసు నుంచి అలసిపోయి వచ్చారు. మధ్యలో లేస్తే తలనొప్పొస్తుంది'' అని బయల్దేరబోయింది.

''అర్ధరాత్రెక్కడికే? ఎవరైనా చూస్తే ఏమయినా వుందా? నా పరువు పోతుందే'' కసిరాడు వెంకట్రావ్.

''ఇందులో పరువు పోవడానికేం వుందండీ! మేం కూడా మీలానే ఆడవాళ్ళందరం రోజుకొకరింట్లో సరదాగా కాలక్షేపం చేద్దామనుకున్నాం. వెధవ జీవితం బోర్ కొడుతోంది. అదే ఇల్లు, అవే పనులు, అదే పిల్లలు, అదే మొగుడూ! కాస్త వెరైటీగా వుంటుందని ఇలా రోజుకొకరింట్లో సరదాగా సినిమా చూస్తూ కాలక్షేపం చేద్దామనుకున్నాం!'' నింపాదిగా చెప్పింది.

''వాళ్ళ మొగుళ్ళు ఒప్పుకున్నారా?''

''భలేవారే. ఎందుకొప్పుకోరు? మీలాగే చక్కగా అర్థం చేసుకుంటారు గానీ, మిమ్మల్ని నేను అర్థం చేసుకోలేదా. అలాగే మీరు మమ్మల్ని అర్థం చేసుకోవాలంతే'' అంటూ జవాబు కూడా ఎదురు చూడకుండా వెళ్ళింది స్పర్శ.

వెంకట్రావుకి నోట మాట రాక జుట్టు పీక్కున్నాడు.

ఈ తంతు ఒక్కరోజుతో ఆగలేదు. మూడు రోజులు. రోజూ పదకొండింటికి వెళ్ళడం, ఒంటిగంటకు రావడం!

'ఎక్కడికెళ్తుందిది? నాలాగే ఇది కూడా..' ఇక తట్టుకోలేకపోయాడు.

ఆరోజు కూడా బయలుదేరబోతున్న భార్యను ఆపి ''నా మాట వినవే! మగాళ్ళం మేమే మానేశాం మీటింగులూ అవీ! ఆడాళ్ళు మీకెందుకు? చక్కగా మొగుడితో కాలక్షేపం చెయ్యక'' అన్నాడు.

''అయ్యోపాపం! మీరు మానేయడం ఎందుకు? ఎంతో సరదాగా వుంటేనూ. వెరైటీ వెరైటీ! నాకు మాత్రం మానాలని లేదు'' అంటూ చెప్పులేసుకుంది స్పర్శ.

''స్పర్శా! నా మాట విను ప్లీజ్! నన్నిలా తలుపు చెక్కలో పెట్టి నలగ్గొట్టడం ఏమీ బాగా లేదు. నలుగురికీ తెలిస్తే నేను ఆత్మహత్య చేసుకోవాల్సిందే. ఇక అర్ధరాత్రి గడపదాటితే ఒట్టు. నేను వెళుతున్నానని నువ్వూ వెళుతున్నావు కదూ?''

''వెళ్ళండి. మీరెళితే నాకేం బాధగా లేదు. మరి నేను వెళితే మీరెందుకంత బాధపడుతున్నారు?''

''మగాడ్నే. నేనేం చేసినా పట్టించుకోరు. మీరే మైనా చేస్తే మేం సొసైటీలో తిరగలేం. ప్లీజ్ నా మాట విను. ఇక నుంచి నేను కూడా వెళ్ళను. కావాలంటే కాళ్ళయినా పడతాను. నువ్వు మాత్రం వీధి కెక్కకే'' అని ప్రాధేయపడ్డాడు. దాంతో చెప్పులు విడిచి లోపలికొచ్చింది. 'దారికొచ్చాడు జీవుడు' అనుకుంది. ఇక అర్ధరాత్రి బయటకెళ్ళడని కూడా అనుకుంది స్పర్శ.

''స్పర్శా! నిజం చెప్పు... రోజు ఎక్కడికెళుతున్నావే'' అడిగాడు వెంకట్రావ్.

''మీరెక్కడికెళుతున్నారో అక్కడికే! మీరేం చేస్తున్నారో అదే'' అంది.

అంతే ఇక ఆ టాపిక్‌లోకి వెళ్ళడం అనవసరమనుకుని అటు తిరిగి పడుకున్నాడు.

'నీలా చెడు తిరుగుళ్ళు తిరగలేదని, పక్కింటి పిన్నిగారి సలహాతో రోజూ ఒంటిగంట వరకు పక్కింట్లోనే కాలక్షేపం చేశాను' అని చెప్పాలనిపించినా 'మళ్ళీ అర్ధరాత్రి మీటింగులు మొదలవుతాయేమో'నని చెప్పకుండా నవ్వుకుంది స్పర్శ.

భర్త చేసే తప్పుడు పనులను ఓర్చుకునే కాలం కాదిది! సంసారం ఇద్దరూ మోస్తున్నప్పుడు రెండు చక్రాలు ఒకే గతిన నడవాలి. ఏ చక్రం గతి తప్పినా ఆ సంసార బండి కుంటుపడుతుంది. 'ఏదెలా జరగాలో అలాగే జరుగుతుంది. నా నుదుటిన ఇలా రాసి వుంది' అని సర్దుకుపోయే కాలం కాదిది! తొక్కిపెట్టాలని చూస్తే నొక్కిపెట్టే కాలం! మదం ఎక్కువైతే మాడు అదరగొట్టే కాలం! కాలి కింద అదిమితే కొండితో కుట్టే కాలం!

టిట్ ఫర్ టాట్!

